andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 ; కనిష్ఠం 24.8



నిర్మల్ జిల్లా వార్తలు
8
బుధవారం 24 జూలై 2024



గుండెగావ్ గ్రామంలో కూలిపోయిన ఇల్లు

భైంసా మండలంలోని గుండెగావ్ గ్రామసూచిక బోర్డు

గుండెగావ్ గోడు పట్టేదెవరికి ?

- పల్సీకర్ రంగారావు ప్రాజెక్టు నిర్వాసితుల హరిగోస
- ఇప్పటికీ దక్కని పునరావాసం
- ప్రతీఏటా వర్షాకాలంలో భయం గుప్పిట్లో జనం
- తాత్కాలికంగా భైంసాకు తరలిస్తూ ఆశ్రయం కల్పిస్తున్న అధికారులు
- ప్రజల ఆందోళనలు పట్టని పాలకులు

నిర్మల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండలంలోని గుండెగావ్ గ్రామం వద్ద నిర్మించిన పల్సీకర్ రంగారావు ప్రాజెక్టు నిర్వాసితుల పాలిట శాపంగా మారుతోంది. ఈ ప్రాజెక్టు కారణంగా బ్యాక్ వాటర్ పరిధిలో ఉన్న గుండెగావ్ గ్రామస్థులకు ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పునరావాసం కల్పించకపోవడం ఆ గ్రామస్థులకు ప్రాణ సంకటంగా మారుతోంది. 2006 సంవత్సరంలో నిర్మాణ పనులు మొదలై 2017 సంవత్సరం ఈ పనులను పూర్తి చేశారు. అయితే 2017 సంవత్సరం నుంచి ఈ గ్రామం ప్రతీఏటా వర్షాకాలంలో ముంపునకు గురవుతోంది. అధికారులు ముంపు బాధితులందరినీ తాత్కాలిక ప్రాతిపదికన భైంసా పట్టణానికి తరలించి అక్కడ వారికి తాత్కాలిక ఆశ్రయం కల్పిస్తున్నారు. ఆ తరువాత వరద ముంపు తగ్గిన అనంతరం వారు మళ్లీ యథావిధిగా గ్రామంలోకే వెళ్లిపోతున్నారు. శాశ్వత పునరావాసం కల్పించకపోతుండడంతో వారు తమ గుండెగావ్ గ్రామాన్నే నమ్ముకోవాల్సి వస్తోంది. 2017 సంవత్సరం నుంచి తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలంటూ గుండెగావ్ గ్రామస్థులు వరుస ఆందోళనలు చేస్తున్నారు. అప్పట్లో ఎమ్మెల్యేలతో పాటు మంత్రి, ఇతర ప్రజా ప్రతినిధులను సైతం వారంతా అడ్డుకొని తమ సమస్యలను పరిష్కరించాలని నిలదీశారు. వీరి నిరసనలను ఇప్పటి వరకు పట్టించుకోలేదు. అయితే ఎన్నికల సందర్భంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఇంద్ర కరణ్‌రెడ్డిలు సైతం ఆ గ్రామాన్ని సందర్శించి పునరావాసం కల్పిస్తామంటూహామీ ఇచ్చినా ఇప్పటి వరకు నెరవేరలేదు. ప్రతీఏటా ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నేతలు గుండెగావ్ గ్రామ ప్రజలకు పునరావాసం కల్పిస్తామని ఇస్తున్న హామీలు నెరవేరడం లేదంటున్నారు. ఈ గ్రామం ఎక్కడో మారుమూల ప్రాంతంలో లేదు. భైంసా పట్టణానికి కూతవేటు సమీపంలోనే ఉండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇలాంటి ముంపు గ్రామాన్ని సైతం పాలకులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గుండెగావ్ గ్రామస్థులకు పునరావాసం కల్పించి వారిని ముంపు భారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

అటకెక్కిన రూ.77 కోట్ల ప్రతిపాదనలు

ఇదిలా ఉండగా గుండెగావ్ గ్రామస్థుల ఒత్తిడి పెరగడంతో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఆగమేఘాల మీద పునరావాసానికి అవసరమయ్యే ప్రతిపాదనలు రూపొందించింది. ఇందులో ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు, వ్యవసాయ భూముల కేటాయింపు లాంటి అంశాల కోసం రూ. 77 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. అయితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను దాదాపు ఏడేళ్ల పాటు పక్కన పాడేసింది. సీఎం స్వయంగా హామీనిచ్చినప్పటికీ ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. నిధుల విషయంలో అప్పటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో గుండెగావ్ ముంపు బాధితులకు పునరావాసం కల్పించలేకపోయారు. ఇప్పటికీ వీరి పరిస్థితి దయనీయంగానే మారిందంటున్నారు. కాంగ్రెస్ పార్టీ మొన్నటి ఎన్నికల సమయంలో గుండెగావ్ బాధితులకు పునరావాసం కల్పించి వారికి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ గ్రామస్థులంతా ఆ హామీపైనే ఆశలు పెట్టుకుంటున్నారు.

వర్షాకాలం అంటేనే గజగజ

అయితే ప్రతీయేటా పల్సీకర్ రంగావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ముంపునకు గురవుతున్న గుండెగావ్ గ్రామస్థులు వర్షాకాలం అంటేనే హడలెత్తిపోతున్నారు. ప్రాజెక్టులోకి వరద నీరు బ్యాక్‌వాటర్ రూపంలో వచ్చి చేరేటప్పుడు తమ గ్రామం పూర్తిస్థాయిలో ముంపునకు గురవుతుందన్న ఆందోళన వీరిని వెంటాడుతోంది. వరద ఉధృతి పెరుగుతున్న సమయంలో ఈ గ్రామస్థులు చాలా మంది తమ ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతుండడం రివాజుగా మారింది. అయితే ఆర్థిక పరిస్థితుల కారణంగా బయటకు వెళ్లలేని వారిని అధికారులు అక్కడి నుంచి భైంసాకు తరలించి తాత్కాలిక ఆశ్రయం కల్పించి చేతులు దులుపుకుంటున్నారు. బ్యాక్ వాటర్ ఉధృతి తగ్గగానే వీరిని షెల్టర్‌ల నుంచి మళ్లీ తమ సొంత ఊరికి వెళ్లిపోతున్నారు. దాదాపు నాలుగైదు నెలల పాటు వీరు తాత్కాలిక ఆశ్రయం పొందుతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నాలుగైదు నెలల పాటు వీరికి ఉపాధి కూడా కష్టతరంగా మారుతోంది. దాతలు అందించే సహాయంపైనే ఆధారపడి బతకాల్సి వస్తుందని అంటున్నారు. ప్రభుత్వమే తాత్కాలికంగా వీరికి వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ శాశ్వత పునరావాస విషయంలో మాత్రం స్పష్టత నివ్వకపోవడం విమర్శలకు కారణమవుతోందని అంటున్నారు.

ప్రభుత్వమే పునరావాసం కల్పించాలి



పల్సీకర్ రంగారావు ప్రాజెక్టులో తమ గ్రామం పూర్తిగా ముంపునకు గురైంది. గత ఎనిమిదేళ్లుగా పునరావాసం కల్పించకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నాం. 2017లో జరిగిన ఎన్నికల్లో అప్పటి సీఎం కేసీఆర్ పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు. కొంత మంది భైంసా సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు త్వరితగతిన పునరావాసం కల్పించాలి.

\- శంకర్‌రావు పటేల్, గుండెగావ్

రూ. 85కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



రూ.85కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అలాగే పల్సీకర్ రంగారావు ప్రాజెక్టు స్థితిగతుల గురించి ప్రభుత్వానికి నివేదించాం. గుండెగావ్ గ్రామవాసులకు పరిహారం అందని మాట వాస్తవమే. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే చర్యలు చేపడతాం.

కోమల్‌రెడ్డి, ఆర్డీవో, భైంసా



భైంసా మండలం గుండెగావ్ గ్రామ సమీపంలో ఉన్న పల్సీకర్ రంగారావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ దృశ్యం

పథకాల అమలులో

ఇబ్బందులు కల్పించే వారిపై కఠినచర్యలు

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ కల్చరల్, జూలై 23 : గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కమిటీలు ఏర్పాటు చేసుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పథకాల అమలు అడ్డుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగబద్ధంగా లేకుండా ప్రజాస్వామిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిందని తెలిపారు.

పారదర్శకంగా పనిచేస్తేనే మన ఉద్యోగానికి సార్థకత

ఉపాధి హామీ తనిఖీ సామాజిక ప్రజావేదికలో డీఆర్‌డీవో విజయలక్ష్మి



ప్రజావేదికలో ఉపాధి హామీ పథకం పనుల వివరాలు వెల్లడిస్తున్న సిబ్బంది

దిలావర్‌పూర్, జూలై 23 : మనం పారదర్శకంగా పనిచేస్తేనే మన ఉద్యోగానికి సార్థకత లభిస్తుందని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక ప్రజావేదికలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సంకల్పంతో ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కూలీలకు పని కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు చాలా కీలకమన్నారు. చేసే పనిని, చెల్లించే వేతనంలో పాదర్శకంగా వ్యవహరించాలన్నారు. పనుల్లో అవినీతి, అక్రమాలకు చోటు ఇవ్వకూడదన్నారు.

రూ. 15,117ల రికవరీ... రూ. 2,000ల పెనాల్టీ...

మంగళవారం దిలావర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో మండలంలోని 12 గ్రామ పంచాయతీలలో జరిగిన తనిఖీ వివరాలను చదివి వినిపించారు. 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు సామాజిక తనిఖీ చేయగా రూ. 45,67,3208 కోట్లు కూలీలకు, రూ. 23,53,882 లక్షలు మెటీరియల్ కింద మొత్తం రూ. 48,02,7190 కోట్లు ఖర్చు చేశారు. పనుల కొలతల్లో తేడా రావడంతో టెక్నికల్ అసిస్టెంట్‌లకు రూ. 15,117ల రికవరీ విధించగా ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ. 2,000ల పెనాల్టీని డీఆర్‌డీవో విజయలక్ష్మి విధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణారాణి, మోహన్, ఎంపీవో అజీజ్ ఖాన్, ఏపీవో దివ్య రెడ్డి, సామాజిక తనిఖీ స్టేట్ అబ్జర్వర్ అంజత్ అలీ, ఎస్ఆర్‌పీ సాయిలు, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, పల్లికొండ నవీన్, డీఆర్‌పీలు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న బస్సు డిపో మేనేజర్ హరి ప్రసాద్

భైంసా, జూలై 23 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలు వనమహోత్సవ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నాయి. కార్యాలయాల ఆవరణల్లో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. మంగళవారం బస్సు డిపోలో మేనేజర్ హరిప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, విజిలెన్స్ సీఐ ఎస్.దయానంద్, డిపో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ భగవంత్‌రావ్‌ల ఆధ్వర్యంలో ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు జోరుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బస్సు డిపో నిర్వాహణాధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒకరూ మొక్కలు నాటి అవి చెట్లు ఎదిగేంత వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పరిఢవిల్లేందుకు అందరూ బాధ్యతాయుతంగా పాటుపడాలని సూచించారు.

కేంద్ర బడ్జెట్‌పై పలువురి స్పందన

నిర్మల్ కల్చరల్, జూలై 23 : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌పై పలువురు తమ స్పందన తెలియజేశారు.

ఆదాయ పన్ను చెల్లింపు దారులకు వెసులుబాటు

- సురేష్, టాక్స్ కన్సల్టెంట్



వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపు దారులకు, ఉద్యోగులకు వెసులుబాటు కల్పించింది. స్టాండర్డ్ డిడక్షన్ 75 వేలకు పెంచడం, కొత్త స్కీములో ఉన్న స్లాబ్‌రేట్లను లాభం చేకూరే విధంగా సవరణ చేశారు. 17,500ల పన్ను లాభం కలుగుతుంది. ఉద్యోగ కల్పన, ఎంఎస్ఎంఈ రంగాలకు చేయూత, ముద్ర లోన్ పరిమితి 20 లక్షలకు పెంపు నిర్ణయం హర్షణీయం.

వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్



- అంజుకుమార్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు

కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యంగా రూపుదిద్దుకుంది. దేశాభివృద్ధిని ప్రోత్సహిస్తూ మహిళలు, బాలికలకు ప్రయోజనం చేకూర్చేలా రూపుదిద్దుకుంది. 3 లక్షల కోట్లు నిధులు కేటాయించింది. గ్రామీణాభివృద్ధికి 2.33 లక్షల కోట్లు నిధులు కేటాయించడం, ముద్ర రుణాల పరిమితి 20 లక్షలకు పెంపు అభినందనీయం.

తెలంగాణకు అన్యాయం

- ఎంబడి రాజేశ్వర్, కాంగ్రెస్ ప్రతినిధి



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగింది. సంకీర్ణ ప్రభుత్వాలున్న బీహార్, ఆంధ్రప్రదేశ్ లకు ఎక్కువ నిధులు కేటాయించారు.

మధ్యతరగతి వర్గాలకు చేయూత

- రావుల రాంనాథ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు

కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి, పేద వర్గాల అనుకూల బడ్జెట్. యువత, విద్యార్థి, నిరుద్యోగులకు అధిక ప్రాధాన్యం కల్పించి నిధులు కేటాయించింది. ఆదాయ పన్ను విధానంలో మార్పులు, స్టాండర్డ్ డిడక్షన్, మొబైల్ ఫోన్లు, బంగారంపై కస్టం డ్యూటీ తగ్గింపు నిర్ణయంతో ప్రయోజనం.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

స్పందనకు వందనం

- శభాష్ మామడ పోలీసు



కోతకు గురైన వాగు గుంతను పూడుస్తున్న పోలీసులు, ఎస్సై సందీప్

మామడ రూరల్, జూలై 23 : ఆదమరిస్తే అంతే...! అని ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో పోలీసులు సోమవారం రోజున కథనానికి స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. దిమ్మదుర్తి నుండి నల్దుర్తి వెళ్లే దారిలో వర్షాలకు భారీ గుంత పడడంతో రాకపోకలకు అంతరాయం కలగడంతో ప్రమాదాలు జరుగకుండా సోన్ సీఐ నవీన్ కుమార్, మామడ ఎస్సై సందీప్, పోలీసుల ఆధ్వర్యంలో గుంతలను మట్టితో పూడ్చడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ... ప్రజలతో మమేకమై పోలీసులు ఇటువంటి కార్యక్రమాలు చేస్తామని, ఏ సమస్య వచ్చినా మా దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్య వచ్చిన వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. గుంతను పూడ్చినందుకు, సమస్య పరిష్కారం చేసినందుకు పోలీసులకు వాహనదారులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట సిబ్బంది లక్ష్మణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు అందించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నిర్మల్ టౌన్, జూలై 23 : ప్రసూతి ఆసుపత్రిలో మహిళలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని జిల్లా ప్రసూతి పిల్లల ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి గర్భిణీలు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలన్నారు. శస్త్ర చికిత్సలను తగ్గించి సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బోధన ఆసుపత్రి పర్యవేక్షకులు డా. సునీల్‌కుమార్, ప్రసూతి ఆసుపత్రి హెచ్‌వోడీ డా. సరోజ, వైద్యులు ప్రదీప్, వాసు, విన్ని, నర్సింగ్ పర్యవేక్షకురాలు ధనలక్ష్మి, కార్యాలయ పర్యవేక్షకుడు నవీన్, నర్సింగ్ అధికారులు రాంబాయియమ్మ, జన, తదితరులు పాల్గొన్నారు.

గొలుసు దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ కల్చరల్, జూలై 23 : జిల్లా కేంద్రంతో పాటు ఇటీవల ఖానాపూర్ ప్రాంతంలో జరిగిన గొలుసు దొంగతనాలకు పాల్పడ్డవారిని పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. మంగళవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో సబ్ డివిజన్ పోలీసు అధికారులు గొలుసు దొంగతనానికి గురైన బాధితులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డీఎస్పీ గంగారెడ్డి నేతృత్వంలో పట్టుకోవడానికి మూడు బృందాలను పంపామని తెలిపారు. బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రతి దొంగతనంపై పూర్తి విచారణ చేయాలని ఆధారాలు సేకరించి వాస్తవాలు నిర్ధారించాలని ఆదేశించారు. పట్టుకున్న దొంగలను కోర్టులో ప్రవేశపెట్టి శిక్షపడేలా చూడాలన్నారు. అట్టివారు జైలు నుండి బయటకు వచ్చిన తరువాత వారి కదలికలను పర్యవేక్షించాలన్నారు. దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి పగలు, రాత్రిపూట పెట్రోలింగ్ ఎక్కువగా చేయాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

బాధతో పోలీసుస్టేషన్లకు వచ్చే బాధితుల పిటిషన్లపై వెంటనే స్పందించాలని, చట్టపరంగా వారికి లభించే న్యాయంపై భరోసా కలిగించాలని ఆదేశించారు. ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చి వాటిని పర్యవేక్షించాలని, నేను సైతం ప్రోగ్రాంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రోత్సహించాలని తెలిపారు. దొంగతనాలు నిరోధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 100 నెంబర్‌కు డయల్ చేసి అనుమానాస్పద వ్యక్తులు, దొంగతనాలపై సమాచారం ఇవ్వాలని, ఇన్ఫార్మర్ వ్యవస్థ బలోపేతం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ అశోక్, క్రైమ్ ఇన్స్‌పెక్టర్ సురేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో చైన్ స్నాచింగ్

- మూడు తులాల బంగారం అపహరణ



సీసీ కెమెరా ఫుటేజ్‌లో నిందితుల దృశ్యం

నిర్మల్ టౌన్, జూలై 23 : నిర్మల్ జిల్లా కేంద్రంలో చైన్ స్నాచర్లు హల్చల్ చేశారు. మంగళవారం రెండు చోట్ల జరిగిన చైన్ స్నాచింగ్ ఘటన ప్రజలను ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేసింది. నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ కాలనీకి చెందిన సుభద్ర బంధువుల ఇంటికి శాస్త్రి నగర్ కాలనీకి వెళ్తుండగా వెనుక నుండి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో నుండ ఇరెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. కాగా పట్టణంలోని వివేకానంద చౌక్ వద్దగల మయూరి హోటల్ ఎదురుగా మెట్‌పల్లికి చెందిన మహిళ తమ కుమార్తె ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుండి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోంచి ఒక తులం బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. స్వల్ప వ్యవధిలోనే జరిగిన ఈ ఘటన రెండుచోట్ల ఒక్కరే దొంగతనానికి పాల్పడగా బాధితుల ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు చేపడుతున్నారు.

రోడ్డుపై కేజీవీల్స్ నడిపిస్తే కఠిన చర్యలు

లక్ష్మణచాంద, జూలై 23 : రోడ్డుపై కేజీవీల్స్ ట్రాక్టర్స్ నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుమలత హెచ్చరించారు. నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల ఆదేశానుసారం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పై విధంగా పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నందున ట్రాక్టర్ యజమానులు కేజీవీల్స్‌తో తారు రోడ్డుపై నడుపరాదన్నారు. రబ్బరు తొడుగులు తొడగటం ద్వారా గాని, ప్రత్యేక వాహనాన్ని ఉపయోగించటం ద్వారా గాని తమ వ్యవసాయ పనులు నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

డిగ్రీ కళాశాలకు

అంతర్జాతీయ గుర్తింపు



ధ్రువపత్రం అందజేస్తున్న బృందం

నిర్మల్ కల్చరల్, జూలై 23 : నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మూడు విభాగాల్లో అంతర్జాతీయ గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ భీంరావు తెలిపారు. ఉత్తమ విద్యాప్రమాణాలు నిర్వహణ, వనరుల నిర్వహణ, పర్యావరణ నిర్వహణలో ఈ గుర్తింపు లభించిందన్నారు. హైమ్ అంతర్జాతీయ సంస్థ అధికారులు కళాశాలలోని సౌకర్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. సోమవారం ధ్రువపత్రాలను అందజేశారు.

రాయల చంద్రశేఖర్‌కు ఘన నివాళులు

నిర్మల్ కల్చరల్, జూలై 23 : విప్లవ యోధుడు రాయల చంద్రశేఖర్ సంతాపసభ మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కే. రాజన్న మాట్లాడుతూ... ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 50 ఏళ్ల పాటు విప్లవోద్యమంలో కొనసాగారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఆయన పని చేసి అమరుడయ్యారని కొనియాడారు.

కులగణన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

నిర్మల్ కల్చరల్, జూలై 23 : ప్రభుత్వం కులగణన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో బీసీ ఉపప్రణాళిక ఏర్పాటు చేసి 20 వేల కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు.

ఐఐటీలో సీటు సాధించడం అభినందనీయం

ముథోల్, జూలై 23 : ముథోల్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన అమన్ అనే విద్యార్థి ఐఐటీ మద్రాస్‌లో సీటు సాధించడం ఎంతో గర్వకారణ మని ముథోల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. తానూర్ మండలానికి చెందిన అమన్ పదవతరగతి వరకు ముథోల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుకున్నారు. తదనంతరం గౌలిదొడ్డి సీవోఈలో సీటు సాధించి మొదటి ప్రయత్నంలోనే ఐఐటీ మద్రాస్‌లో సీటు సాధించడం సాంఘిక సంక్షేమ గురుకులాలకు గర్వకారణ మన్నారు. విద్యార్థికి పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, బుచ్చి రాములు, శ్రీధర్, సీతారాం, ప్రేమ్‌కుమార్, రవీందర్, ఇతర ఉపాధ్యాయుల బృందం పాల్గొని విద్యార్థిని అభినందించారు.

ఆషాడం సందర్భంగా గోరింటాకు సంబరాలు

తానూర్, జూలై 23 : మండలంలోని ఎల్వీ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినిలు గోరింటాకు సంబరాలు నిర్వహించుకున్నారు.

వరద నష్ట నివారణ కోసం ఆర్టీసీ విజిలెన్స్ ముందస్తు చర్యలు


బస్సు డిపోను పరిశీలిస్తున్న విజిలెన్స్, ఆర్టీసీ అధికారులు

భైంసా, జూలై 23 : గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరద నీటితో భైంసా బస్సు డిపోలో ఏర్పడే నష్ట నివారణ చర్యలపై ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. గత సంవత్సరం భారీ వర్షాల మూలంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు సంబంధించిన ఆరు వరద గేట్లను ఎత్తివేయడంతో ఇక్కడి డిపోను వరద నీరు ముంచెత్తి అపార నష్టం వాటిల్లింది. డిపోలోని కంప్యూటర్ వ్యవస్థ మొత్తం దెబ్బతినగా జనరేటర్ పనికిరాకుండా పోయింది. డీజిల్ బంక్‌లో నీరు ప్రవేశించి సమస్య ఏర్పడింది. అంతేకాకుండా డిపో పరిధిలోని వివిధ విభాగాల్లోని గదులన్నీ జలమయమవ్వడంతో అధిక నష్టం జరిగింది. ప్రస్తుతం అధికంగా వర్షాలు కురుస్తుండటంతో పాటు రాగల మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురియనున్నాయని వాతవరణ శాఖ హెచ్చరికాలు జారీ చేసింది.దీంతో ఆర్టీసీలోని విజిలెన్స్ విభాగం అప్రమత్తమయ్యింది. గత సంవత్సరం మాదిరిగా ఇక్కడి బస్సు డిపోకు గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరద నీటితో నష్టం వాటిల్లకుండా ఉండేందుకు గాను ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. మంగళవారం ఆర్టీసీ విజిలెన్స్ ఆదిలాబాద్ రీజియన్ సీఐ ఎస్.దయానంద్ నేతృత్వంలో బృందం భైంసాలో పర్యటించి బస్సు డిపోలో పర్యవేక్షణ చేపట్టింది. డిపో సెక్యూరిటీ అధికారి భగవంత్‌రావ్ నుంచి వరద ముంపుపై వివరాలు సేకరించింది. గత సంవత్సరానికి సంబంధించి డిపోలో ఏర్పడ్డ ముంపుపై పరిశీలన చేపట్టింది. ఈ దఫా గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తితే వరద నీటితో ఎలాంటి నష్టం జరుగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ప్రాజెక్టు గేట్లను ఎత్తే సమయానికి తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై విశ్లేషణ జరిపారు. సెక్యూరిటీ విభాగంతో పాటు బస్సు డిపో నిర్వాహణాధికారులు, సిబ్బంది వాతావరణ శాఖ సూచనలు, హెచ్చరికలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్ సీఐ ఎస్.దయానంద్ సూచించారు. వరదల పరిస్థితిని అంచనా వేసి డిపోలో నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఉట్నూర్‌లో అంబులెన్స్‌లో ప్రసవం

ఉట్నూర్, జూలై23:ఇంద్రవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రసవం కేసు సమాచారం అందించడంతో ఉట్నూర్ 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే స్పందించి జిల్లా కేంద్రంలో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది అంబులెన్స్‌లో కాన్పు నిర్వహించారు. ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న గోపాల్‌పూర్‌కు చెందిన సురేష్ సతీమని సునీతకు హీరాపూర్ వద్ద అంబులెన్స్‌లో సుఖ ప్రసవం నిర్వహించారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ కుంభోజి దత్తాత్రేయ ఇంద్రవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించడంతో పరీక్షలు నిర్వహించి తల్లి, బిడ్డ ఆరోగ్యంగా, క్షేమంగా ఉన్నారని వైద్య సిబ్బంది సంతోషం వ్యక్త పరిచారు. ఉట్నూర్ 108అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ కుంభోజి దత్తాత్రేయ,పైలట్ ప్రవీణ్ కుమార్‌లను పలువురు అభినందించారు.


అంబులెన్స్‌లో ప్రసవం చేసిన 108 సిబ్బంది

'నిధుల కేటాయింపులో తెలంగాణపై వివక్ష'

నిర్మల్‌కల్చరల్, జూలై 23: నిధుల కేటాయింపులో కేంద్రం వివక్ష చూపుతోందని ఉద్యమకారుల ఫోరమ్ ఉమ్మడి జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో విభజన హామీలను సైతం విస్మరించిందని, నిధులను కేటాయించడంలేదని ఆరోపించారు. తెలంగాణకు చెందిన ఇద్దరు కేంద్రమంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా నిధుల మంజూరు చేయించలేకపోతున్నారన్నారు. బుధవారం ఉక్కు,కాజీపేట రైల్వే కోచ్, ఐటీఐఆర్ కారిడార్ తదితర విషయాల్లో రాష్ట్రానికి మొండి చేయి చూపిందన్నారు.

'అందుబాటులో ఉండి సేవలందించాలి'

తాంసి, జూలై 23: మండలంలోని ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ సేవలు అందించాలని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు, కారోబార్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం అయినందున వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని, ఈ విషయంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రం చేయాలని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగం పెంచాలన్నారు. ప్రజా పాలనలో ఇచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీందర్, అధికారులు సంపూర్ణ, ఏపీవో విజయ, తదితరులు ఉన్నారు.

'విరాసత్ పట్టాలు వెంటనే ఇవ్వాలి'

నేరడిగొండ, జూలై 23: ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఐటీడీఏలోని ఆర్ఓఎఫ్ఆర్‌వో విరాసత్ పట్టాల కోసం ఆరు సంవత్సరాల నుంచి ఆదివాసీ గిరిజన బిడ్డలు ఐటీడీఏ చుట్టు తిరుగుతు చెప్పులు అరిగిన గాని గిరిజన ఆదివాసీ బిడ్డలకు అందని పట్టాలు. ఇది అధికారుల నిర్లక్ష్యం వలన ఆదివాసీ గిరిజన ఒక్క రైతుకి పది ఎకరం పట్టా అందజ అనుకున్నగాని సంవత్సరానికి రూ.లక్ష రైతుబంధు, అదే ఆరేళ్ల అనుకుంటే రూ.6 లక్షలు నష్టపోయినారని మహేందర్ జాదవ్ అధికారులపై మండిపడ్డారు. వెంటనే నష్టపోయిన ఆదివాసీ గిరిజన బిడ్డలకు ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని ఆదివాసీ గిరిజన బిడ్డలకు పట్టాలు అందించాలన్నారు. లేనిపక్షంలో ఆదివాసీ గిరిజన బిడ్డలతో రెండు మూడు రోజులలో ఐటీడీఏని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ పోసుట్లను వెంటనే భర్తీ చేయాలన్నారు. లంబాడీల ఐక్యవేదిక మండల అధ్యక్షుడు పందులైవ్ నాయకులు వసంత్‌రావు సురేందర్, తదితరులున్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో అమలు చేయాలి : ఏనుగు

జైనథ్, జూలై 23: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా రైతుకు రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో మాఫీ చేయాలని బీజేపీకిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు ఏనుగు రాకేష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టో రుణమాఫీ పెట్టి ఏడు నెలలు గడుస్తున్న రుణమాఫీ ఇంకా కొలిక్కి రాలేదని విమర్శించారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, దక్కన్ గ్రామీణ బ్యాంక్ అధికారుల నిండు నిర్లక్ష్యం వల్ల ఒక్క రైతు రూ.లక్ష రుణం తీసుకుంటే రూ.69వేలు, మరో రైతుకు రూ.3వేలు, మరొకరికి రూ.22వేలు బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి అని అన్నారు. రైతుకు రూ.లక్ష రుణం తీసుకుంటే రూ.లక్ష వరకు రూ. రెండు లక్షల రుణం తీసుకుంటే రూ.రెండు లక్షల వరకు మాఫీ చేసే బాధ్యత ప్రభుత్వానిది, బ్యాంకర్లదని అన్నారు. ఈ విషయంపై సంబంధిత తహసీల్దార్ కలెక్టర్‌లకు లిఖిత పూర్వకంగా విన్నవించామన్నారు. లేనిపక్షంలో స్థానిక అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిడాం రాకేష్‌రెడ్డి, కుంట సురేష్‌రెడ్డిలతో పాటు రైతులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు : సుగుణ

సిరికొండ, జూలై 23: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేస్తున్న నేపథ్యంలో బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా మాఫీ అయిన ప్రతీ రైతుకు లబ్ధి చేకూరేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును రైతులతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఖరీఫ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో బ్యాంకు అధికారులు రుణమాఫీ విషయంలో ఇబ్బందులకు గురి చేయవద్దని, ఎలాంటి నిబంధనలు పెట్టకుండా రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని, న్నారు. రుణమాఫీ అయిన లబ్దిదారులకు వెంటనే రుణాలను అందించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. అధికారుల నిర్లక్ష్యం!

● డోర్లీ-కప్పర్‌దేవి రోడ్డును తవ్వారు.. వేయడం మరిచారు ● ఏడాది కాలంగా పత్తా లేని కాంట్రాక్టర్లు
● పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు ● ఆర్టీసీ బస్సు బంద్‌తో 20 గిరిజన గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు


భారీ వర్షాలకు బురదమయంగా మారిన డోర్లీ-కప్పర్‌దేవి రోడ్డు

తలమడుగు, జూలై 23: మారుమూల గిరిజన గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలని సంకల్పంతో ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ కొంత మంది కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యం అధికారుల నిర్లక్ష్యంతో మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు కనీస రోడ్డు సౌకర్యానికి నోచుకోవడం లేదు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో గల తలమడుగు మండలం డోర్లీ నుంచి కప్పర్ దేవి, రోడ్డు నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో మంజూరు కాగా అధికారులు రోడ్డు నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ ఉన్న రోడ్డును తవ్వి సంవత్సరం అవుతున్న ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో దాదాపు 20 గిరిజన గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాకుండా బస్సు సౌకర్యం నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉమ్రి, కోసాయి, దెగామ, పల్సిబి, పల్సి(బి) తండా ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో గిరిజన గ్రామాలను తండాలను గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేసి రోడ్డు మంజూరు చేసిన గుత్తేదారుడు రోడ్డు పనుల నిమిత్తం రోడ్డును తవ్వి రోడ్డు పనులు మధ్యలో ఆపి వేశారు. వర్షాకాలం నేపథ్యంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డుపై నీరు చేరి రోడ్డు చిత్తడిగా మారి రోడ్డు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డు మొత్తం చెడిపోవడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోవడం వల్ల ఆదివాసీ గిరిజన ప్రజలు, విద్యార్థులు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి ఉందని గతంలో ప్రజా ప్రతినిధులకు చెప్పిన స్పందన లేదని గిరిజన గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును వెంటనే బాగు చేయాలని కోరుతున్నారు.


గంగాపూర్ వాగులో 3వ రోజూ గాలిస్తున్న పోలీసులు


గంగాపూర్ వాగు ఒడ్డున కూర్చుండి భర్త కోసం రోదిస్తున్న సుశీల

పెన్‌గంగా నదిలో యువకుడి మృతదేహం లభ్యం


శివకార్తిక్ మృతదేహం

జైనథ్, జూలై 23: ఆదిలాబాద్ మండలం చాందా(టి) గ్రామానికి చెందిన కొత్తం శివకార్తిక్ సోమవారం జైనథ్ మండలంలోని డొల్లార పెన్‌గంగానదిలో స్నానానికి అనివెళ్లి వరదలో కొట్టుక పోయారు. ఆయన ఆచూకీ కోసం డీడీఆర్ఎఫ్ బృందంతో పాటు జైనథ్ మండల రూరల్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం ఆధ్వర్యంలో మృతదేహం కోసం ముమ్మరంగా గాలంపు నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం మృతదేహం పైకి తేలడంతో పెన్‌గంగా డొల్లార సమీపంలో కార్తిక్ మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులు కేసు నమోదు చేశారు. శవ పంచనామా నిమిత్తం ఆదిలాబాద్ ప్రభుత్వ రిమ్స్ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చరేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై కె.పురుషోత్తం తెలిపారు.

● గంగాపూర్ వాగులో కొనసాగుతున్న గాలింపు చర్యలు

ఉట్నూర్: నాలుగు రోజుల కింద గంగాపూర్ వాగులో గల్లంతు అయిన యువకుడి కోసం ఉట్నూర్ పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. గత శనివారం రాత్రి గంగాపూర్ వాగు దాటుతుండగా బొప్పరికుంటకు చెందిన టేకం లక్ష్మణ్ అనే గిరిజన యువకుడు వాగు వరదనీటిలో పడి కొట్టుకుపోవడంతో ఆదివారం ఫిర్యాదు అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు ప్రారంభించారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ గండికోట మొగిలిల ఆధ్వర్యంలో ఏఎస్సై దిలీప్ మంగళవారం గాలింపు చర్యలు నిర్వహిస్తున్నారు. వర్షం పడుతుండడంతో గాలింపు చర్యలకు అంతరాయం కలుగుతుందని అంటున్నారు. ఒక వైపు పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపడుతుండగా లక్ష్మణ్ భార్య సుశీలతో పాటు గ్రామస్థులు వాగు ఒడ్డున కూర్చుని ఎదురు చూస్తున్నారు. లక్ష్మణ్ భార్య సుశీల మాత్రం తన భర్త తిరిగి రావాలని కోరుకుంటు వాగు ఒడ్డుకు రోదిస్తుండడంతో గ్రామస్థులకు బంధువులకు ఆమెను ఓదార్చడం కష్టతరంగా మారింది. కేవలం రెండున్నర ఏళ్లలోపే దేవుడు మాకు ఎడబాటు చేస్తాడా? అంటూ రోధిస్తోంది.


మొక్క నాటుతున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, అధికారులు

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ఆదిలాబాద్ రూరల్, జూలై 23: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, తద్వారా భావితరాలకు మంచి ఆరోగ్యకర భవిష్యత్తును అందించగలుగుతామని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో డీఎంహెచ్‌వో మొక్కలను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో జిల్లా మలేరియా అధికారి ఎం.శ్రీధర్, అదనపు డీఎంహెచ్‌వో గజానన్, ఎన్‌హెచ్ఎం కార్యక్రమం అధికారి అనిల్‌కుమార్ తెలిపారు.

'క్షీరాభిషేకాలు చేయడం హాస్యాస్పదం'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 23: రుణమాఫీలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే మరో పక్క కాంగ్రెస్ నాయకులుపాలాభిషేకాలు నిర్వహించడం హాస్యాస్పదమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. రైతులకు అందించాల్సిన రుణమాఫీలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని తిప్పికొట్టాలని సూచించారు. మంగళవారం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులతో పార్టీ కార్యాలయంలో చర్చ వేదిక నిర్వహించి పలు సూచనలను తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ గ్రామాలలో రైతులు రుణమాఫీ విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు తమ దృష్టికి తీసుకు రావడం జరుగుతుందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా రూ.2లక్షల మాఫీ చేయని పక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఇందులో మార్శెట్టి గోవర్ధన్, గంద్రత్‌రమేష్, లింగారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగ్‌రావు, సేవ్వాజగదీప్, వేణుగోపాల్ యాదవ్, తదితరులున్నారు.

'వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరం'

బోథ్, జూలై 23: మండల కేంద్రంలోని వసతి గృహంలో మంగళవారం డాక్టర్ నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు వివరించారు. అంతేగాక ప్రతివారం తమ పడుకునే బట్టలను శుభ్రంగా ఉతుక్కోవాలని సూచించారు. వైద్య శిబిరంలో హెచ్ఎస్ కవిత, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్ఎం సుమంగళ, స్నేహ, ఆశ, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం'

నేరడిగొండ, జూలై 23: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాయకులెప్పుడు కూడా ప్రజల్లో ఉండాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పోరాడాలని పేర్కొన్నారు.

'వీరుల త్యాగాలను మరవద్దు'

బోథ్, జూలై 23: దేశం కోసం ప్రాణం త్యాగం చేసిన భారతదేశ ముద్దు బిడ్డలను ఎప్పటికీ మరువ వద్దని వారి త్యాగాల ఫలితమే ఈరోజు స్వేచ్ఛగా జీవిస్తున్నామని విజ్ఞాన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎశైలజ పేర్కొన్నారు. మంగలవారం మండల కేంద్రంలోని పాఠశాలలో బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు దేశం కోసం చేసిన పోరాటాలను, ప్రాణ త్యాగాలను విద్యార్థులకు వివరించారు.

పత్తి పంటపై చీడపీడల నివారణకు జాగ్రత్తలు వహించాలి


కుంటాల రైతు వేదికలో పత్తి పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

కుంటాల, జూలై 23 : పత్తిపంటపై చీడపీడల నివారణ, ప్రత్యేక సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త రాంప్రసాద్, రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కిరణ్ బాబు మంగళవారం కుంటాల రైతు వేదికలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తిపంటపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాతావరణంలో మార్పుల దృష్ట్యా రైతులు ఎప్పటికప్పుడు పంటలను పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఏడీఏ వీణ మాట్లాడుతూ రైతులు రైతుబీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతేగాకుండా ఇది వరకు ఉన్నటువంటి రైతుబీమాలో నామినీ పేర్లు గాని ఆధార్‌లో తప్పులుంటే సరిచేసుకోవాలన్నారు. ఆగస్టు 5వ తేదీలోగా రైతుబీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సోమలింగారెడ్డి, ఏఈవోలు మహేష్, ప్రగతి, శ్రీధర్, గణేష్‌లు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

భైంసా రూరల్, జూలై 23 : మండలంలోని పాంగ్రి గ్రామంలో మంగళవారం ఉపాధ్యాయులు రాములు, హైమత్, పంచాయతీ కార్యదర్శి అన్వేష్‌లను గ్రామ పెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మంచి బోధన అందించారని తెలిపారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను కూడా సన్మానించి, విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు నేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆనందరావు పటేల్, విశ్వనాథ్, బాలాజీ పటేల్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, అన్వేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం



దిలావర్‌పూర్, జూలై 23 : మండలంలోని మాడెగాం ప్రభుత్వ పాఠశాలలో 14 సంవత్సరాలుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు నగేష్‌ను విద్యార్థులు, గ్రామస్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ గురుకుల, నవోదయ శిక్షణను ఇచ్చి సీట్లు సాధించేలా చేసి పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసిన ఉపాధ్యాయుడు నగేష్‌కు విద్యార్థులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు భుజంగ్ రావు, రాజు, ముత్యం, కదిలి దేవస్థానం చైర్మన్ వెంకట్‌రావు, మాజీ చైర్మన్ సంభాజీ పటేల్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు ప్రత్యేక గుర్తింపు : మెప్మా


భైంసా మున్సిపల్ పరిధిలోని వ్యాపారులకు పంపిణీ చేసేందుకు సరఫరా అయిన గుర్తింపు బోర్డుల బాక్స్‌లు



వీధి వ్యాపారుల గుర్తింపు బోర్డులు

భైంసా, జూలై 23 : మున్సిపాల్టీల్లో వీధి వ్యాపారులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని మెప్మా అధికారులు తెలిపారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో 9,738 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు గుర్తించామని మంగళవారం తెలిపారు ప్రధానమంత్రి స్వనిధి యోజన కింద గుర్తించిన వీధి వ్యాపారులకు ఉపాధి కల్పించేందుకు నాలుగేళ్లుగా మొదట విడత రూ. 10వేలు, రెండో విడతరూ. 20వేలు, మూడో విడత రూ. 50వేలు రుణం ఇస్తున్నారు. వీటిని సకాలంలో చెలించే వారికి సంక్షేమ పథకాలలో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

● వ్యాపారం పేరుతో బోర్డులు

పీఎం స్వనిధి ద్వారా వీధి వ్యాపారులకు ఇప్పటికే రుణాలు తీసుకొని లబ్ధి పోందుతుండగా వీరికి రక్షణగా ఉండేందుకు వీలుగా ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయించారు. వీరికి గుర్తింపు కార్డులు జారీ చేశారు. పట్టణ వీధుల్లో, మార్కెట్‌లో పని చేసే చోట సైన్ బోర్డులు ఉండేలా చర్యలు చేపట్టారు. దీనిపై చిరువ్యాపారుల ఫోటో, వ్యాపార నిర్వహణకు అనుమతించే ధ్రువపత్రం సంఖ్య చిరునామా, ఏ వ్యాపారం చేస్తున్నారో వివరాలను రాయించారు. సంబంధిత బోర్డులు ఇటీవల మున్సిపాలిటీలకు సరఫరా అయ్యాయి. వీటిని త్వరలోనే వీధి వ్యాపారులకు పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర మెప్మా శాఖ అనుమతి ఇవ్వగానే స్థానికంగా వీటిని అందిస్తామని మెప్మా అధికారి తెలిపారు.


● జిల్లాలో 9738 మంది వీధి వ్యాపారులు

జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 9738 మంది వీధి వ్యాపారులు పీఎం స్వనిధి యోజన ద్వారా రుణాలు తీసుకొని లబ్ధిపొందుతున్నారు. వీరిలో నిర్మల్ మున్సిపల్ పరిధిలో 5849, భైంసా మున్సిపల్ పరిధిలో 2754, ఖానాపూర్ మున్సిపల్ పరిధజిలో 1135 మంది వీధి వ్యాపారులున్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అప్పజెప్పాలంటూ లబ్ధిదారుల ఆందోళన

● భైంసా ఆర్‌డీవో కార్యాలయ ముట్టడి ● ఆవరణలో బైఠాయించి.. నిరసన ప్రదర్శన


భైంసాలోని ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించిన డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారులు


ఆర్‌డీవో కార్యాలయ ఆవరణలో బైఠాయించిన లబ్ధిదారులు

భైంసా, జూలై 23 : కాలయాపనకు తావులేకుండా తమకు ఇళ్లను వెంటనే అప్పచెప్పాలని డిమాండ్ చేస్తూ భైంసా పట్టణ డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులు ఆందోళనలు చేపట్టారు. మంగళవారం ఉదయం పట్టణ పరిదిలోని వివిధ ప్రాంతాలకు చెందిన లబ్దిదారులు స్థానిక విశ్రాంతి భవనం నుంచి ర్యాలీగా తరలివెళ్లి అర్‌డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రవేశ మార్గంలోని అవరణలో బైఠాయించి నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఎడాది కాలం క్రితం లక్కీ డ్రా ద్వారా లబ్దిదారులకు ఎంపికైన తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అప్పచెప్పకపోవడాన్ని వ్యతిరేకిస్తూ ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఆందోళనలను హోరెత్తించారు. ఇండ్లను కేటాయించేంత వరకు తాము ఇక్కడి నుంచి కదలబోమని భీష్మించుకొని అక్కడే కూర్చుండిపోయారు. పరిస్థితిని గుర్తించిన ఆర్‌డీవో కోమల్‌రెడ్డి లబ్దిదారులతో మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాల్లో ఇంకా మౌలిక వసతుల కల్పన పూర్తి కాలేదని వివరించారు. ఇందు కోసం గాను ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. నిధుల మంజూరి అవ్వగానే అన్ని రకాల వసతులు, సౌకర్యాలను కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను అప్పచెబుతామని వివరించారు. దీంతో లబ్దిదారులు గత నెలన్నర రోజులుగా అధికారులు ఇదే రీతిలో సమాధానాలిస్తూ దాటవేసే దోరణి విధానాలను అవలంభిస్తూ సమస్యను పరిష్కరించడం లేదని ఆరోపించారు. రెండు రోజుల్లోగా ఇళ్లను కేటాయించకపోతే నిరహార దీక్షలు చేపడుతామని వెల్లడించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వాహనాలను తనిఖీ చేసిన సీఐ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భైంసా రూరల్, జూలై 23 : మండలంలోని మాటేగాం టోల్‌ప్లాజా వద్ద మంగళవారం సీఐ నైలు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వాహనదారులు జాతీయ రహదారిపై ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడిపి ఇంటికి చేరుకోవాలన్నారు. అదేవిధంగా వాహనాల ధ్రువీకరణ పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్ తప్పక ధరించి, జాతీయ రహదారి భద్రత నియమ నిబంధనలు పాటించాలన్నారు. లేనియెడల కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నైలు, ఏఎస్సై, పోలీసు బృందం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

కుభీర్, జూలై 23 : మండల కేంద్రం కుభీర్‌లో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త బడేబియా, రిటైర్డ్ కండక్టర్ బోయిడి రాజేశ్వర్ కుటుంబ సభ్యులను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు డా. కిరణ్‌కొమ్రెవార్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట నాయ కులు మాజీ ఎంపీటీ దేవిదాస్, ఎన్నిల అనీల్, పుప్పాల పీరాజీ, బాబు, పోగు ల పోతన్న, దత్త్రత్రి, కాశీనాథ్, తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.3, కనిష్ఠం 23.7



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

బుధవారం 24 జూలై 2024

పరిష్కారం కాని కార్మికుల సమస్యలు : రాజు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 23: ప్రభుత్వాలు మారినా.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గాజెంగుల రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని నేతాజీచౌక్‌లో కార్మికులతో కలిసి ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నా విజయవంతంపై అవగాహన కల్పించారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గాజంగుల రాజు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.



అడ్డూ, అదుపులేని.. వడ్డీ వ్యాపారం

- జిల్లాలో అమాయక రైతుల నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారులు
- అన్నదాతల అవసరాలే ఆసరాగా.. అడ్డగోలు వ్యాపారం
- గ్రామాల్లో యథేచ్ఛగా సాగుతున్న కోట్ల రూపాయల దందా
- ఇటీవల రుణమాఫీ సొమ్ము అందడంతో పెరుగుతున్న ఒత్తిళ్లు
- వారం వారం వాయిదాలతో వచ్చికాడికి దండుకుంటున్న దళారులు
- మామూలుగానే తీసుకుంటున్న సంబంధిత శాఖల అధికార యంత్రాంగం
- జిల్లావ్యాప్తంగా కలుపుతీత, పురుగు మందుల పిచికారి, డౌరా లాంటి పనుల్లో నిమగ్నమైన రైతులు



ఆదిలాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): అమాయక రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న కొందరు వ్యాపారులు.. అడ్డగోలుగా వడ్డీ వ్యాపారానికి ఎగబడుతున్నారు. వ్యవసాయ పెట్టుబడులకు అవసరమైన అప్పుల కోసం రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కొందరు దళారులు జిల్లాలో వడ్డీ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో తమకున్న పరిచయాలతో వడ్డీ వ్యాపారాన్ని విస్తరింప చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా కోట్ల రూపాయల అక్రమదందా కొనసాగుతున్నా.. అడిగే వారే కరువయ్యారు. అవసరానికి డబ్బులు ఇవ్వడంతో రైతులు కూడా ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పత్తి, సోయా, కంది, ఇతర పంటలను వేసిన రైతులు కలుపు, మందుల పిచికారి, డౌరా లాంటి పనుల్లో నిమగ్నమయ్యారు. రైతు భరోసా ఆలస్యం కావడం తో పెట్టుబడి సహాయం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. అయితే ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం లక్ష లోపు రుణమాఫీని చేయడంతో అప్పులు తీర్చాలంటూ రైతులపై ఒత్తిళ్లు పెరిగి పోతున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా అసలు నిబంధనల ప్రకారం వడ్డీ వ్యాపారం నిర్వహించాలంటే ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే నిర్వహించిన వ్యాపారానికి కొంత సొమ్మును పన్ను రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి నియమ నిబంధనలు లేకుండానే కోట్ల రూపాయల దందా చేస్తూ భారీగా దండుకుంటున్నారు. ఆదిలాబాద్, ఇచ్చోడ, బోథ్, ఉట్నూర్ కేంద్రాలుగా జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారం దందా కొనసాగుతోంది.

గ్రామాల్లోకి వడ్డీ వ్యాపారులు

రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేయడంతో రైతులకు కొత్త ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అప్పులు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారులు ఒత్తిళ్లు చేస్తున్నారు. రైతుల ఇళ్లలోకి వెళ్లి అప్పు కట్టాలంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇటీవల గ్రామాల్లో వడ్డీ వ్యాపారుల సంచారం కూడా పెరిగిందంటూ చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. బ్యాంకుల్లో రుణమాఫీ సొమ్ము జమైన విషయాన్ని తెలుసుకుంటున్న దళారులు రైతులను వేధించడం మొదలు పెడుతున్నారు. గ్రామాల్లో పరువు పోతుందన్న భయంతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు వెనుకాడడం లేదు. అప్పులు వసూలు చేసేందుకు దళారులు ఎంతకైనా తెగిస్తున్నారు. మొండి బకాయిలను వసూలు చేసేందుకు గ్రూపులుగా ఏర్పడుతున్న దళారులు దాడులు చేసేందుకు కూడా వెనుకాడడం లేదు. మానసికంగా, శారీరకంగా రైతులను ఒత్తిళ్లకు గురి చేయడంతో సతమతమవుతున్నారు. తమ ప్రతినిధులతో బెదిరింపులకు సైతం దిగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సకాలంలో అప్పు చెల్లించని వారిపై దుర్భాషలాడుతూ వివిధ రకాలుగా ఒత్తిళ్లు చేయడం పరిపాటిగా మారింది. ఇదంతా బహిరంగంగానే సాగుతున్నా.. అధికారులు అడ్డుచెప్పక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రైతులను గ్రూపులుగా మార్చి

గ్రామాల్లో యథేచ్ఛగా వడ్డీ వ్యాపారం చేస్తున్న దళారులు కొత్త ఎత్తుగడలను వేస్తున్నారు. కొంతమంది రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేస్తూ అప్పులను అంటగడుతున్నారు. ఒక్కో గ్రూపులో 5 నుంచి 10మంది సభ్యులు ఉండే విధంగా జాగ్రత్త పడుతున్నారు. ఇందులో ఏఒక్కరు అప్పును చెల్లించక పోయినా.. మిగితా రైతులే బాధ్యులంటూ షరతులు విధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులతో గ్రామాల్లో చిన్నపాటి ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయి. బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ఎన్నో నిబంధనలు, షరతులు విధిస్తున్నా వడ్డీ వ్యాపారులు మాత్రం ఆధార్‌కార్డు ఆధారంగా గంటల వ్యవధిలోనే అప్పులు ఇచ్చేస్తున్నారు. రైతులకు గత్యంతరం లేకనే ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇచ్చిన సొమ్మును తిరిగి తీసుకునేందుకు వారం వారం వాయిదాల రూపంలో వసూలు చేస్తున్నారు. రైతుల అవసరాలను పసిగడుతున్న వ్యాపారు లు ఇష్టం వచ్చినట్లు వడ్డీ రేటును నిర్ణయిస్తున్నారు. 10 శాతానికి పైననే వడ్డీ రూపంలో దండుకుంటున్నారు. అలాగే అమాయక గిరిజన రైతులను తప్పుడు లెక్క లతో నిండా ముంచుతున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించినా.. వడ్డీకి కూడా సరిపోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వడ్డీల తో అప్పులు తీరక ఆందోళనకు గురవుతున్నారు. ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల్లో విచ్చలవిడిగా వడ్డీ వ్యాపారం దందా కొనసాగుతున్నా.. అడ్డుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సంక్షిప్త సమాచారం



కేంద్రమంత్రితో ఎంపీ గోడం నగేష్

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

ఆదిలాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎంపీ గోడం నగేష్ మంగళవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నవోదయ, కేంద్రీయ విశ్వ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన జిల్లాకు కేంద్ర ప్రభుత్వం మెరుగైన విద్య అవకాశాలను కల్పించాలని కోరారు. స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, జూలై 23: అసెంబ్లీ సమావేశాల తర్వాత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని పలు సమస్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, మాజీ జడ్పీటీసీ జహీర్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు రాహుల్‌ముండే, సురేందర్, తదితరులున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తాంసి, జూలై 23: మండలంలో పొన్నారి గ్రామంలో చేపడుతున్న పారిశుధ్యం పనులను మంగళవారం ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి పరిశీలించారు. గ్రామంలో చేపట్టే మురికి కాలువల శుభ్రత గురించి ప్రజలకు అవగహన కల్పించారు. గ్రామాల్లో చెత్తా చెదారం లేకుండా చూసే బాధ్యత గ్రామ కార్యదర్శులదేనని ఆదేశించారు. ప్రజలు వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఉబికి వస్తున్న పాతాళగంగ

బోథ్, జూలై 23: మండలంలో గత మూడు రోజులు కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ బోరుబావుల్లోంచి పాతాలగంగా ఉబికి వస్తోంది. కనుగుట్ట గ్రామానికి చెందిన భీమ ప్రవీణ్ అనే రైతు పొలంలో ఉన్న బోరు బావి నుంచి నీరు దానంతట అదే పైకి రావడంతో స్థానిక రైతులు ఆసక్తిగా చూశారు.



బోరు బావి నుంచి ఉబికివస్తున్న నీరు



పట్‌పడి తండాలో సీత్లా భవానికి పూజలు చేస్తున్న గిరిజనులు



తరలివచ్చిన ఆదివాసీ గిరిజన మహిళలు

సప్త మాతృకల ఆరాధనే సీత్లా పండుగ

- పశు సంపద రోగాల బారీనపడకుండా ఆదివాసీ గిరిజనుల ప్రత్యేక పూజలు
- ప్రకృతిని పూజించడం, ప్రేమించడం వారి ప్రత్యేకత

నేరడిగొండ జూలై 23: వివిధ రోగాల బారీనపడి చనిపోతున్న పశుసంపదను కాపాడాలని కోరుతూ గిరిజనులు సప్త మాతృకలు అయినటువంటి (ఏడుగురు దేవతలు) మేరామ, తల్లా, కంకాళీ, మంత్రాల్, హింగ్లా, ద్వాళాగర్, సీత్లా భవాని ఏడుగురు దేవతలను పూజించుటయే సీత్లా పండుగను మంగళవారం మండలంలోని వాగ్దారి, బోందిడి, వాంకిడి గ్రామాలలో గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. పట్‌పడి తాండలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బోథ్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు హాజరై సీత్లా భవానికి ప్రత్యేక పూజలు చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గిరిజనుల కట్టు, బొట్టు, వేశాధారణ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు అతి పవిత్రంగా ఉంటాయని ప్రకృతిని పూజించడం, ప్రేమించడం గిరిజనుల ప్రత్యేకత అన్నారు. పశు సంపదలకోసం గిరిజనులు సప్త మాతృకలను ఆరాధిస్తు సీత్లా పండుగను గిరిజన జాతి శోభ ఉట్టి పడేలా జరుపుకోవడం ఆనందాయక మన్నారు, పశు సంపదకు ఏలాంటి రోగాలు రాకుండా ఏడుగురు దేవతలు కాపాడుతాయని గిరిజన ప్రజల ప్రగాఢ విశ్వాసమన్నారు. ఈపండుగను రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు జరుపుకోవాలని మత పెద్దలు, సాహితి వెత్తలు, విద్యావంతులు కోరుతున్నారన్నారు. అంతేకాకుండా గిరిజనులు జరుపుకునే పండుగల్లో మొదటి పండుగ సీత్లా పండుగ కావడం విశేషమన్నారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు నాయక్, కారోభారి, డావ్, గేర్యాలతో పాటు మాజీ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.



రోగులతో కిటకిటలాడుతున్న బోథ్ ఆసుపత్రి



పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో వైద్య శిబిరానికి తరలివచ్చిన స్థానికులు

వీడని ముసురు.. ప్రబలుతున్న వ్యాధులు!

- జిల్లాలో గత మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలు
- పలు గ్రామాలలో ముసుకుంటున్న వైరల్ జ్వరాలు
- ఆసుపత్రుల్లో రోజురోజుకూ పెరుగుతున్న రోగుల సంఖ్య
- వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి : వైద్యులు

బోథ్, జూలై 23: గత మూడు రోజులుగా మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. పగలు, రాత్రి ముసురు వీడకపోవడంతో జన జీవనం స్తంభించింది. ఇళ్లు విడిచి ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని పోలీసు అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. అయితే వాతావరణ మార్పులతో ప్రజలను సీజనల్ వ్యాధులు వెంటాడుతున్నాయి. మండలకేంద్రంతో పాటు పార్డీ, మర్లపల్లి, కౌటా(బి), దన్నూర్ గ్రామాలలో వైరల్ జ్వరాలతో పాటు విరేచనాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ఆసుపత్రిలో చేరే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయి. కాగా, వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని డాక్టర్ విజేష్ పేర్కొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో వైద్య శిబిరం

ఆదిలాబాద్ రూరల్, జూలై 23: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను రక్షించేందుకు వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహి స్తున్నారు. ఆదిలాబాద్‌లోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం డాక్టర్ సాయిరాం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీ ప్రజలకు వైద్య బృందం పరీక్షలు జరిపి మందులను అందజేశారు. ఇందులో వైద్య సిబ్బంది, కాలనీవాసులు, శంకరయ్య, రూపేష్, త్రియంబక్, బాబు రెడ్డి, శంకర్, ప్రణయ్, తదితరులున్నారు.

జిల్లాలో గత మూడు రోజులుగా వర్షాలు

ఆదిలాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా ఓమోస్తరు స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. పెన్‌గంగా, కుంటాల, పొచ్చెర జలపాతాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వర్షాల కారణంగా పర్యటకులు రావద్దంటూ సూచిస్తున్నారు. మంగళవారం జిల్లా సాధారణ వర్షపాతం22.0 మి.మీ.లు కాగా 0.4 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. బోథ్‌లో 4.83, ఉట్నూర్‌లో 1.3, సోనాలలో 3.8 మి.మీ.ల వర్షపాతం కురిసింది. మిగితా మండలాల్లో కనిష్ఠ స్థాయిలో వర్షపాతం నమోదైంది. జూన్ 1నుంచి జూలై 23 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 437.4మి.మీ.లు కాగా, 502.5 సాధారణ వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువుల, కుంటలు, ప్రాజెక్టుల్లోకి స్వల్పంగానే వరదనీరు వచ్చి చేరుతోంది. సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 286.50 మీటర్లు కాగా ప్రస్తుతం 283.80 మీటర్లకు చేరింది. మత్తడివాగు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 కాగా ప్రస్తుతం 275.950 మీటర్ల వద్ద నిలకడగా ఉంది. వర్షాలతో కుంటాల, పొచ్చెర జలపాతాలు వరదనీటితో పరవళ్లు పెడుతున్నాయి.



ఇన్‌చార్జీ హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఐటీడీఏ పీవో

ఆకస్మిక తనిఖీలతో హడలెత్తించిన పీవో

- ఇన్‌చార్జీ హెచ్‌ఎం, మరి కొందరికి షోకాజ్ నోటీసులు

ఉట్నూర్, జూలై 23: ఉమ్మడిజిల్లాలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల పనితీరుపై ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త ఆకస్మిక తనిఖీలతో మంగళవారం హడలెత్తించారు. దీనిలో భాగంగా బేల(బి) ఆశ్రమ పాఠశాల, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పీవో ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు మెరుగైన విద్యుత్‌తో పాటు ప్రభుత్వం అందిస్తున్న విద్య, వైద్యం, సౌకర్యాలను కల్పించాలని అన్నారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతీరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. ప్రతినిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే వంటగది, స్టోర్‌రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. పలువురి సెలవులను రిజిస్టర్‌లో నమోదు చేయనందున ఇన్‌చార్జీ హెచ్‌ఎం జి.శ్వేతకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. గత ఐదు రోజుల నుంచి ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు నమోదు చేయనందున షోకాజ్ నోటీసు జారీ చేశారు. అలాగే, గత ఐదు రోజుల నుంచి ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు అయిన ఉపాధ్యాయుడు దశరథ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. అలాగే అక్కడే పని చేస్తున్న శంభు అనే వర్కర్ తన స్థానంలో వేరే వాళ్లతో పని చేయించడంపై ఆగ్రహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించి రికార్డులు పరిశీలించారు. సకాలంలో ఔషధాల రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించనని మెడికల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వంటి వ్యాధులు ప్రబలకుండా, పరిసరాలలో వర్షపు నీరునిలువకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కుంగిన వంతెన.. రాకపోకల నిలిపివేత

ఆదిలాబాద్ రూరల్, జూలై 23: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పలు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి-చించుఘాట్ గ్రామాల మధ్య గల మర్రివాగుపై బ్రిడ్జి మంగళవారం కుంగిపోయింది. దీంతో డీఎస్పీ జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు రూరల్ సీఐ, పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి కుంగిన బ్రిడ్జిపై నుంచి తాత్కాలికంగా వాహనాల రాకపోకలు నిలిపివేశారు. త్వరలో మరమ్మతులు చేయించి రాకపోకలను పునరుద్ధరించనున్నారు.



రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసిన రూరల్ సీఐ